క్లుప్తంగా

ధనుర్మాస పూజలు



ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను అర్చకులు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణలతో దేవస్థానం మారుమోగింది.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజల నిర్వహించారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



చైర్మన్, వైస్ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ సుబ్బారావు సూచించారు. ఉస్టన్ చానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన బత్తల హరికృష్ణ, జొన్నా శివకుమార్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సత్కరించిన అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. సాగునీటి కాలువలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని కోరారు. నీటి సంఘ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మదన్, నేతలు కృష్ణ, రాజేంద్ర, రవి, సిద్ధార్థ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: హోటళ్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో హోటల్ యజమానులకు అవగాహన సదస్సును ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నీరజ, ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధికి కృషి



కోవూరు: నియోజకవర్గంలోని సాగునీటి కాలువలను రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సదరన్ ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు జెట్టి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సదరన్ ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆదాల శివారెడ్డి, నేతలు జెట్టి మదన్‌రెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, అశోక్‌కుమార్, బాలరవి, ఎంపీటీసీ సభ్యులు సునీల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు



నావూరు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సీఐ

పొదలకూరు : మండలంలోని విరువూరు, నావూరు ప్రభుత్వ లేఅవుట్లను మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. గతంలో జగనన్న లేఅవుట్లకు సంబంధించి ప్రైవేట్ వ్యక్తుల వద్ద భూములు కొనుగోలు చేసి లేఅవుట్ల నిర్మాణం చేసి న వాటిపై విజిలెన్స్ సీఐ సుభానీ విచారించారు. భూములు అమ్మిన వారి నుంచి వివరాలు సేకరించారు.

క్రీడలంటే ఆసక్తి.. మైదానాల్లేక విరక్తి

- ప్రాంగణాల అభివృద్ధిని పట్టించుకోని విద్యాశాఖ
- విద్యార్థులకు ప్రోత్సాహం కరువు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయి. చదువుతోపాటుగా క్రీడలకు ప్రాధాన్యత నివ్వాలి. ప్రతి గ్రామంలో పీవీ సింధు వంటి క్రీడాకారిణి తయారు కావాలి. ఇవీ తరచూ అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలు. కానీ పాఠశాలల్లో మైదానాల్లేవు. ఒక వేళ ఉన్నా నిరుపయోగంగా మారాయి. క్రీడల్లో విద్యార్థులకు ఆసక్తి ఉన్నా.. ప్రోత్సాహం కరువై విరక్తి చెందుతున్నారు.



వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొద్దిపాటి క్రీడా మైదానం

వెంకటాచలం: పాఠశాలల్లో క్రీడా మైదానాల విషయంలో విద్యాశాఖ నిర్లక్ష్యం కన్పిస్తుంది. మైదానాలు ఉన్న చోట్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపడుతున్న దాఖలాల్లేవని విమర్శలున్నాయి. విద్యాశాఖ ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా, క్రీడా మైదానాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు. ఎవరైనా రాణించినప్పుడు మాత్రం గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తామంటూ ఆర్భాటపు ప్రచారాలు చేస్తున్నారు. ఆక్రమణల్లో ఉన్న మైదానాలను గుర్తించి వాటి అభివృద్ధికి కృషి చేస్తే ప్రతి పాఠశాల నుంచి క్రీడాకారులు తయారవుతారు. వెంకటాచలం మండలంలో 8 జెడ్పీ ఉన్నత పాఠశాలులు, నాలుగు గురుకుల పాఠశాలు, 70 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 6,025 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వెంకటాచలం, గుడ్లూరువారిపాళెం మినహా మిగతా ఆరు పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉన్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సగానికి పైగా క్రీడా మైదానాల్లేవు. వెంకటాచం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం లేకపోవడంతో అక్కడ విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. చిన్న మైదానంలో వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలను ఆడుతున్నారు. గుడ్లూరువారిపాళెంలో మైదానం అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పాఠశాల స్థలాలు ఆక్రమణదారుల చేతిల్లో ఉన్నాయి. స్థానికంగా పెత్తనం చెలాయించే వ్యక్తులు పాఠశాలల స్థలాలనూ వదలడం లేదు. గడ్డివాముల కోసం ఆక్రమించేస్తున్నారు. కురిచెర్లపాడు వీవర్స్ కాలనీ పాఠశాలలో పాఠశాలలోనే గేదెలను కట్టేసి మేపుకుంటున్నారు. కసుపూరు పాఠశాల స్థలాలు ఆక్రమణల్లో ఉన్నాయి. దీంతో విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించాలని ఉన్నా ఆడేందుకు అనువైన మైదానాలు కరువయ్యాయి.

విద్యార్థుల్లో నిరుత్సాహం

క్రీడల్లో రాణింపునకు చిన్నతనం నుంచే క్రీడల్లో ఆసక్తి చూపితేనే సాధ్యమవుతుందనేది గుర్తింపు పొందిన క్రీడాకారులు చెప్పే మాటలు. కానీ మైదానాలు లేనికారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు అన్నీ క్రీడల్లో పాల్గొనలేక పోతున్నారు. పల్లెల్లో ఎక్కువగా క్రికెట్ క్రీడ అంటే విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతారు. కానీ మైదానాల లేని కారణంగా విద్యార్థులు క్రికెట్ ఆడలేక పోతున్నారు. ఆసక్తి ఉన్న క్రీడలు కాకుండా ఇతర క్రీడల్లో పాల్గొంటూ సరైన ప్రతిభ చూపలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించేలా క్రీడా స్థలాలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు తమకు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా క్రీడా స్థలాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలకు అనువైన మైదానం లేదు



మా పాఠశాలలో క్రీడలకు అనువైన మైదానం లేదు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నాం. అన్నీ రకాల క్రీడలు ఆడేందుకు మైదానం ఉంటే ఇంకా ప్రతిభ చూపగలం.
– హారిక, 10 తరగతి విద్యార్థిని

మైదాన సౌకర్యం కల్పించాలి



పాఠశాలలో మైదాన సౌకర్యం లేకపోవడంతో క్రీడల్లో పాల్గొనేందుకు అసౌకర్యంగా ఉంది. పాఠశాలకు మైదానం కోసం స్థలం కేటాయించి, వసతులు కల్పిస్తే అన్నీ క్రీడలు ఆడే అవకాశం కలుగుతుంది. ఉన్నపాటి కొద్ది స్థలంలోనే క్రీడల్లో పాల్గొంటున్నాం.
– శ్రావణి, పదో తరగతి విద్యార్థిని



గొలగమూడి ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో చిన్న స్థలంలోనే క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినులు

రెవెన్యూ సదస్సుల్లో సమస్యల వెల్లువ



కొడవలూరు: సమస్యలను ఆరాతీస్తున్న వంశీకృష్ణ

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు సమస్యలు వెల్లువెత్తాయి. భూముల సర్వేకు సంబంధించి 7 అర్జీలు రాగా పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఇంటి నివేశన స్థలం కోసం 6 అర్జీలు అందాయి. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శ్రీనివాసులు, సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, నాయకులు రామమోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గండవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో అందే ఎక్కువ భాగం అర్జీలను మండల పరిధిలోనే పరిష్కరించే వెసులుబాటు ఉందని చెప్పారు. సమస్య తన పరిధిలోదైతే ప్రత్యేక చొరవతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సదస్సుల్లో వచ్చిన అనేక రెవెన్యూ సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని వివరించారు. తహసీల్దార్ స్ఫూర్తి, సర్పంచ్ రాజకుమారి, ఆర్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు ఏడుకొండలు, మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారిద్దాం



బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న రమణమ్మ

మనుబోలు: బాల్య వివాహాల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్ఎన్‌పురంలో మంగళవారం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగవాళ్లకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాలికలకు 18 ఏళ్ల కన్నా తక్కువ వయస్సులో వివాహం జరిపిస్తే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. చిన్న వయస్సులో గర్భం దాలిస్తే తలెత్తే పరిణామాలపై అవగాహన కల్పించారు. బాల విహాలను ప్రోత్సహిస్తే చట్ట ప్రకారం రెండేళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రేవతి, హెల్పర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి



జిగురు అట్టల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముత్తుకూరు: వేరుశనగ పంటలకు పురుగు మందుల వినియోగం తగ్గించాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, ఆత్మ పీడీ శివన్నారాయణ చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంటపాళెంలో వేరుశనగ పంటలను మంగళవారం పరిశీలించారు. పంటలో పురుగులను నివారించేందుకు లింగాకర్షక బుట్టలు, పసుపు–నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకునే విధానాలను రైతులకు వివరించారు. సోలార్ లైట్ ట్రాప్‌ల వినియోగాన్ని చూపించారు. జిప్సం, బయో ఫర్టిలైజర్స్ ఉపయోగాలను తెలియజేశారు. వ్యవసాయాధికారి జోత్స్నరాణి, వీఏఏ రమణమ్మ పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



పోలీసులు విడుదల చేసిన ముఠా సభ్యుల చిత్రం

మనుబోలు: అపరిచితులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మనుబోలు ఎస్సై శివరాకేష్ సూచించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో దుప్పట్లు, రగ్గులు, స్వెటర్లు, సూట్‌లు ఇతర వస్తువులు చవక ధరలకు విక్రయించే పేరుతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఓ ముఠా జిల్లాలో సంచరిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. వీరంతా బీదర్, గుల్బర్గా ప్రాంతాల నుంచి వచ్చిన గ్యాంగ్‌స్టర్లని, పగలు దుస్తులు, వస్తువులు విక్రయించే నెపంతో షాపులు, గృహాలపై రెక్కీ నిర్వహించి ఆపై దొంగతనాలకు పాల్పడే ముఠా అని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల అవగాహన కోసం ముఠా ఫొటోలను విడుదల చేశారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం



విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

పొదలకూరు : పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవన్‌లో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఎస్‌కే మస్తాన్‌సాహేబ్, పీ మస్తానయ్య, సీసీర్ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. పెన్షన్ల సంఘం అధ్యక్షుడు కొత్తలూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ ధర్మస్వరూప్ నకార పెన్షనర్ల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన పోరాట ఫలితంతో 1982 డిసెంబరు 17న సుప్రీం కోర్టు ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని తీర్పు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆ చరిత్రాత్మక తీర్పు వెలుడిన డిసెంబరు 17వ తేదీన జాతీయ పెన్షనర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కదిరి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ యూ.మస్తానయ్య, జీ నారాయణరెడ్డి, వి.శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, కండే కృష్ణయ్య పాల్గొన్నారు.

గులకతో గుంతలు పూడ్చినా సరే..



గులకతో పూడ్చిన గుంతలు

ముత్తుకూరు: ముత్తుకూరు బీసీ కాలనీ రోడ్డులోని నిలువెత్తు గుంతలు ఇటీవల వర్షాలకు మడుగులుగా మారి, రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడింది. వాహనచోదకులకు నరకంగా మారింది. ఈ సమస్యపై 'సాక్షి'లో కథనం వెలువడడంతో స్థానిక నాయకులు స్పందించారు. బూడిద నిండిన గులకతో గుంతలు పూడ్చారు. తాత్కాలికంగా రిపేర్లు చేసినప్పటికీ, గులక వల్ల ద్విచక్ర వాహనాల టైర్లు జారిపోవడంతో తరచూ ప్రమాదాలు ఏర్పడుతున్నాయి.

విద్యుత్‌కు అంతరాయం నేడు

కోవూరు: మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని ఈఈ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



వంట గదిని పరిశీలిస్తున్న బాలచంద్రబాబు

కొడవలూరు: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పారిశుధ్యాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు మంగళవారం పరిశీలించారు. వంట గది, సరుకుల స్టాక్ రూమ్, మరుగుదొడ్లు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక రకాల వ్యాధులను అరికట్టొచ్చని చెప్పారు. గురుకుల పరిసరాల్లో నీటి నిల్వల్లేకుండా చూడాలని కోరారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా లాంటి వ్యాధులొచ్చే అవకాశం ఉన్న తరుణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమతెరలను వాడాలని సూచించారు. గురుకుల ప్రిన్సిపల్ దేవసహాయం, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం సుభాషిణి పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం పథకానికి 50 శాతం రాయితీ



పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రమేష్‌నాయక్

పొదలకూరు : నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్ఎం) పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీని అందజేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రమేష్‌నాయక్ తెలిపారు. మండలంలోని మహ్మదాపురంలో పశువులకు ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభి మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా పాలు, మాంసం ఉత్పత్తులకు సంబంధించి యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే రూ.కోటి వరకు బ్యాంక్‌లు పెట్టుబడి పెట్టేందుకు అవకాశం ఉందన్నారు. రూ.కోటి బ్యాంకు రుణంతో యూనిట్ ప్రారంభిస్తే ప్రభుత్వం రూ.50 లక్షలు అందజేస్తుందన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో పాడి రైతులకు మినీగోకులాలు, పశుగ్రాస క్షేత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. గడ్డి పెంపకం కోసం 10 సెంట్లను నుంచి అర ఎకరం వరకు రైతులు లబ్ధిపొందేందుకు అవకాశం ఉందన్నారు. అర ఎకరంలో గడ్డి పెంచితే ప్రభుత్వం రూ.32,992 మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కోవూరు డీఎల్‌డీఏ డాక్టర్ డీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కోడె దూడలను పుట్టించే సెమన్ ప్రాధాన్యతను వివరించారు. నెల్లూరు పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రైతులకు అందుతున్న రాయితీలను వివరించారు. పొదలకూరు ఏడీఏ డాక్టర్ అరుణ పశుగణన గురించి రైతులకు తెలిపారు. శిబిరంలో 100 పశువులకు గర్భకోశ చికిత్సలు, 20 పశువులకు సాధారణ చికిత్సలను అందజేశారు. 50 పశువులకు నట్టల నివారణ మందును తాగించి రూ.20 వేల విలువైన మందులను రైతులకు అందజేశారు. ఈ శిబిరంలో తాటిపర్తి, తోడేరు, అల్లీపురం పశువైద్యాధికారులు డాక్టర్ సీ మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ శిరీషా, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, జీ శిఖామణి, డేనియల్, గ్రామపెద్దలు గడ్డం తిరుపాల్‌రెడ్డి, అడపాల సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లను నివారించాలి



కొడవలూరు: రామన్నపాళెంలో..



విడవలూరులో..



కోవూరులో..

కొడవలూరు: వరిలో ఆకుముడత, మోము పిప్పి తెగుళ్లను నివారించుకోవాలని కోవూరు ఏడీఏ సుజాత సూచించారు. మండలంలోని రామన్నపాళెం, ఆలూరుపాడులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఈ తెగుళ్ల నివారణకు గానూ వేప నూనె ఐదు మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి వినియోగించాలని సూచించారు. ఏఓ లక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు పృథ్వి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: మండలంలోని దండిగుంట, చౌకచర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడారు. వర్షాలు కురవనున్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరినాట్లను తర్వాత వేయాలని సూచించారు. అనంతరం దండిగుంటలోని పొలాలను పరిశీలించారు. వీఏఏలు చెంచులక్ష్మి, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక, రావూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరిని ఆకుముడత, పచ్చ పురుగులు ఆశించాయని, వీటి నివారణకు మందును పిచికారీ చేయాలని సూచించారు. వీఏఏలు శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: యాజమాన్య పద్ధతులను రైతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. మండలంలోని వేగూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాటూరు, ఇనమడుగులో బీపీటీ – 5204 వరి రకంలో జింక్ లోపం బాగా కనిపిస్తోందని చెప్పారు. వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన మందులను పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు నర్సోజీ, కెనరా బ్యాంక్ అధికారులు రవిశంకర్, కాశయ్య, ఏఓ ఇంద్రావతి, సహాయకులు సుభాషిణి, కోటేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు భూసారానికి చేటు

తోటపల్లిగూడూరు: రసానిక ఎరువులతో భూసారానికి చేటు అని ఏఓ శిరీషారాణి తెలిపారు. మండలంలోని మాచర్లవారిపాళెం, అనంతపురం రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఏఓ శిరీషారాణి మాట్లాడుతూ వీలైనంత వరకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన ఎరువులను వాడి నేలల్లో భూసారాన్ని పెంచాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఎకరాకు రూ.168 ప్రీమియం చెల్లించి పంటల బీమా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీతో గడువు ముగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

పొదలకూరు : వరిలో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కే శివనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ప్రభగిరిపట్నం రైతుసేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పైపాటు ఎరువులను ఇబ్బిడిముబ్బిడిగా వేయకూడదన్నారు. సమావేశంలో ఏఓ ఎ.వాసు తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో..



తోటపల్లిగూడూరు: మాచర్లవారిపాళెంలో..



పొదలకూరు: మాట్లాడుతున్న ఏడీఏ